# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక




## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 334 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | మంగళవారం | 21-1 -2025 | వెల : .రూ. 5.00

## దోషి సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

- ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసు
- బాదితురాలి కుటుంబానికి 17 లక్షల పరిహారం
- కోల్‌కతాలోని సిల్దా కోర్టు సంచలన తీర్పు

కోల్‌కతా,

కోల్‌కతా ఆర్‌జీకర్ మెడికల్ కాలేజీలో ట్రెయినీ వైద్యురాలిపై హత్యాచారం కేసుకు సంబంధించి దోషి సంజయ్ రాయ్ కి కోల్‌కతాలోని సిల్దా కోర్టు జీవిత ఖైదు శిక్ష వేస్తూ తీర్పు నిచ్చింది. ఈ కేసులో ఇప్పటికే

-మిగతా 2 లో



## ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

- నేటి నుంచి గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్,జనవరి 20(నీలగిరి ఎక్‌ప్రెస్)
కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మరో అవకాశం ఇవ్వాలని నిర్ణయించింది రాష్ట్ర ప్రభుత్వం. జనవరి 21 నుంచి జరిగే గ్రామ సభల్లో వీటి కోసం అప్లికేషన్లు స్వీకరించాలని కలెక్టర్లను

-మిగతా 2 లో



## రాహుల్ గాంధీకి ఊరట

- క్రిమినల్ కేసు విచారణను నిలిపివేసిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ,
కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి భారీ ఊరట లభించింది. కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీపై చేసిన వ్యాఖ్యలకు గానూ దాఖలైన పరువు నష్టం కేసులో ఆయనపై క్రిమినల్ విచారణను సుప్రీంకోర్టు నిలిపివేసింది. 2018 లో బెంగళూరులో జరిగిన విలేకరుల సమావేశంలో కేంద్ర హెూం

-మిగతా 2 లో

## పెట్టుబడులు తేవడమే

# లక్ష్యంగా

### దావోస్ చేరుకున్న సీఎం రేవంత్ బృందం



- పెట్టుబడులు లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం
- గత ఏడాది రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులు
- ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా అన్న సీఎం రేవంత్

హైదరాబాద్,జనవరి 20(నీలగిరి ఎక్‌ప్రెస్)
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బృందం దావోస్ చేరుకుంది. ఆయనవెంట ఐటిశ్శాఖ మంత్రి శ్రీధర్ బాబు, ఐటి సెక్రటరీ జయేశ్ రంజన్ ఇతర ప్రతినిధులు ఉన్నారు. సింగపూర్ పర్యటనను విజయవంతంగా

-మిగతా 2 లో




## చిన్మయ్ కృష్ణ దాస్‌కు మరోసారి నిరాశ

హైకోర్టులో విచారణకు రాని బెయిల్ పిటిషన్

ఢాకా,
బంగ్లాదేశ్ జాతీయ జెండాను అవమానించారంటూ 'దేశద్రోహం' ఆరోపణల కేసును ఎదుర్కొంటున్న 'బంగ్లాదేశ్ సమ్మిళిత్ సనాతని జాగరణ్ జోతె' ప్రతినిధి చిన్మయ్ కృష్ణ దాస్ కు మరోసారి నిరాశ ఎదురైంది. బెయిలు కోరుతూ ఆయన హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్

-మిగతా 2 లో



## కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

- ఐటి కోసం ఆనాడు పడ్డ కష్టానికి ఫలితం దక్కింది
- సత్య నాదెళ్ల లాంటి వారు మైక్రోస్టాఫ్ట్ సిఇవో కాగలిగారు
- కన్నవూరు కోసం పాటుపడేలా ముందుకు రండి
- మరో జన్మంటూ ఉంటే తెలుగువాడిగా పుడతా
- జ్యూరిచ్ పారిశ్రామికవేత్తల సదస్సులో చంద్రబాబు

జ్యూరిచ్,జనవరి 20(నీలగిరి ఎక్‌ప్రెస్)
కర్మభూమిని, జన్మభూమిని మరవ వద్దని ఎపి సిఎం చంద్రబాబు ప్రవాసాంధ్రులను కోరారు. తెలుగుజాతి అభివృద్దికి పాటుపడాలని అన్నారు. ఉన్నచోట ఉంటూనే అక్కడి దేశ అభివృద్ధితో పాటు, కన్నభూమి అభివృద్ధికి కూడా తోడ్పడాలని అన్నారు. ఏ దేశమైనా యువత వల్లే అభివృద్ధి చెందుతుందని చంద్రబాబు అన్నారు. అందుకే రాజకీయాల్లోకి వచ్చేలా యువతను ప్రోత్సహించి నట్లు చెప్పారు. రాష్ట్రానికి పెట్టుబడులు సాధించడమే లక్ష్యంగా ప్రపంచ

-మిగతా 2 లో

## సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్



- కేసీఆర్ పాలనలో హ్యాపీగా కార్మికులు
- మూడుసార్లు జీతాలు పెంచిన దేవుడు కేసీఆర్
- అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచాం
- మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్,
ఈ రాష్ట్రంలో పని చేసే కార్మికుల అభివృద్ధి కోసం నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారని బీఆర్ఎస్ వర్కింగ్

-మిగతా 2 లో

## అమెరికా అధ్యక్షుడిగా

# ట్రంప్ ప్రమాణం




### హాజరైన విదేశాంగ మంత్రి జైశంకర్...ముఖేశ్ అంబానీ

- ప్రమాణం చేయించిన సుప్రీం ప్రధాన న్యాయమూర్తి
- తొలుత ప్రమాణం చేసిన ఉపాధ్యక్షుడు జెడి వాన్స్

వాషింగ్టన్,జనవరి 20(నీలగిరి ఎక్‌ప్రెస్)
అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. వాషింగ్టన్‌లోని క్యాపిటల్ హిల్ రోటుండాలో అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాలకు చెందిన పలువురు అగ్రనేతలు, పారిశ్రామిక, టెక్ దిగ్గజాలు, అతిరథ మహారథులు హాజరయ్యారు. వీరందరి సమక్షంలో అగ్రరాజ్యం 47వ అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణస్వీకారం చేశారు. గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో విజయం సాధించిన 78 ఏళ్ల ట్రంప్ చేత అమెరికా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ప్రమాణం చేయించారు.

-మిగతా 2 లో



# దోషి సంజయ్ రాయ్‌కి జీవిత ఖైదు

(మొదటి తరువాయి)

విచారణను పూర్తి చేసిన కోల్‌కతాలోని సీల్దా కోర్టు.. గత శనివారం సంజయ్ రాయ్ దోషి అని తేల్చింది. ఈ కేసులో సోమవారం తీర్పును వెలువరిస్తామని చెప్పిన కోర్టు.. తాజాగా అతడికి జీవిత ఖైదు విధిస్తూ తీర్పును ఇచ్చింది. ఇక సంజయ్ రాయ్ కి ఏం శిక్ష విధిస్తారని దేశం మొత్తం తీవ్ర ఉత్కంఠగా ఎదురుచూస్తుండగా.. అతడికి జీవిత ఖైదు విధించారు. మరోవైపు ఇంత దారుణంగా హత్యాచారం చేసిన సంజయ్ రాయ్ కి ఉరిశిక్ష విధించాలనే డిమాండ్లు వెల్లువెత్తాయి. కేసులో తీర్పు ఇవ్వడానికి ముందుగా సీల్దా కోర్టు జడ్జి జస్టిస్ అనిర్బన్ దాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు అరుదైనది అని తాను భావించడం లేదని.. అందుకే చనిపోయే వరకు జైలు శిక్ష అనుభవించాలని తీర్పును ఇస్తున్నట్లు ప్రకటించారు. ఇదే సమయంలో ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులకు రూ. 17 లక్షల పరిహారం చెల్లించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. 2023 ఆగస్ట్ 9వ తేదీ రాత్రి కోల్‌కతాలోని ఆర్జీకర్ హాస్పిటల్ సెమినార్ రూమ్‌లో నిద్రిస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, ఆపై హత్య జరగడం దేశంలో తీవ్ర సంచలనాన్ని రేపింది. మొదట కోల్‌కతా పోలీసులు ఈ కేసు విచారణ ప్రారంభించగా.. పశ్చిమ బెంగాల్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలతో సీబీఐ రంగంలోకి దిగింది. ఈ నేపథ్యంలోనే స్పెషల్ కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్ పేరును మాత్రమే అందులో చేర్చింది. అయితే ఈ ఘటనలో సామూహిక అత్యాచారం విషయాన్ని ఛార్జిషీట్‌లో పేర్కొనలేదు. ఆర్జీకర్ మెడికల్ ఆస్పత్రి ఆవరణలోని సీసీటీవీలో నమోదైన దృశ్యాల ఆధారంగా సంజయ్ రాయ్ ని గతేడాది ఆగస్ట్ 10వ తేదీన కోల్‌కతా పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో అరెస్ట్ అయిన ఆర్జీకర్ మాజీ ప్రిన్సిపల్ సందీప్ ఘోష్, తాలా పోలీస్ స్టేషన్ మాజీ ఆఫీసర్ ఇంఛార్జ్ అభిజిత్ మండల్‌లకు ఇప్పటికే బెయిల్ లభించింది. ఈ ఘటనలో సాక్ష్యాలు తారుమారు చేశారనే ఆరోపణలపై వారు అరెస్టు కాగా.. అరెస్ట్ తర్వాత 90 రోజుల్లో పోలీసులు, సీబీఐ ఛార్జ్‌షీట్ ౹÷ల్ చేయకపోవడంతో వారికి బెయిల్ వచ్చింది. జంజ్రయాయ్‌కు జీవిత ఖైదు శిక్ష విధించింది. అతడు మరణించే వరకు జైల్లోనే ఉంచాలని కోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది. అలాగే సంజయ్‌రాయ్‌కు రూ.50 వేల జరిమానా సైతం కోర్టు విధించింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తు చేసింది. అందులోభాగంగా మొత్తం120 మంది సాక్షులను సీబీఐ విచారించింది. దీంతో భారత న్యాయసంహిత చట్టంలోని సెక్షన్లు 64, 66,103/1 కింద సంజయ్‌కు జీవిత ఖైదు విధించింది. బాధితురాలి కుటుంబానికి న్యాయం జరగాలంటూ దేశవ్యాప్తంగా వైద్యులంతా ఆందోళనకు దిగారు. ఇక పశ్చిమ బెంగాల్ వైద్యులు అయితే.. తమ ఆందోళనలను మరింత ఉధృతం చేశారు. ఆ క్రమంలో వైద్య సేవలు సైతం నిలిచిపోయాయి. దీంతో వారితో చర్చలు జరిపేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. కానీ వైద్యులు.. తమ డిమాండ్లను మమతా బెనర్జీ ముందు ఉంచారు. కానీ వాటిలో కొన్నింటిని మాత్రమే ఆమె ఒప్పుకున్నారు. అనంతరం ప్రభుత్వం దిగి వచ్చి.. వైద్యులతో చర్చలు జరిపింది. అందుకు న్యాయం చేస్తామని.. అందుకు కొంత గడువు కోరింది. దీంతో వైద్యులు సానుకూలంగా స్పందించారు. కానీ ఇచ్చిన హామీలు ప్రభుత్వం నెరవేర్చక పోవడంతో.. వైద్యులు మళ్లీ ఆందోళన బాట పట్టారు. మరోవైపు అత్యవసర సేవలకు ఎటువంటి అటంకం కలిగించమని వైద్యులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఇక ఈ హత్యాచార ఘటనపై ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్ సందీప్ ఘోష్ వెంటనే స్పందించారు. ఈ హత్యాచార ఘటనను ఆయన ఖండించారు. మృతురాలు తన కుమార్తెతో సమానమన్నారు. ఈ తరహా ఘటనలు భవిష్యత్తులో జరగకూడదని ఆకాంక్షించారు. ఈ మేరకు ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందించారు. ఆ కొద్ది రోజులకే ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్ పదవికి రాజీనామా చేశారు. ఆయితే ఆ వెంటనే ఆయన్ని మరో మెడికల్ కాలేజీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమించింది. క ఆర్ జీ కర్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఉన్న సమయంలో సందీప్ ఘోష్ పై పలు అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో కోర్టు జోక్యం చేసుకొని.. ఆయనను విధుల నుంచి తప్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. ఇక ఇదే తనను బలి పశువును చేశారంటూ నిందితుడు సంజయ్ రాయ్.. కోర్టుకు విన్నవించుకొన్నాడు. అంతేకాదు.. విధులకు హాజరైన ట్రెయినీ వైద్యురాలు.. రాత్రి 11.00 గంటల సమయంలో సెమినార్ హాల్‌లో విశ్రాంతి తీసుకొనేందుకు వెళ్లింది. ఆ ఉదయానికి ఆమె హత్యాచారానికి గురై విగత జీవిగా మారింది. అయితే సెమినార్ హాల్‌లో సీసీ టీవీ కెమెరాలు లేకపోవడం గమనార్హం.

# పెట్టుబడులు తేవడమే లక్ష్యంగా

(మొదటి తరువాయి)

పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి దావోస్ పర్యటనకు బయలు దేరింది. దావోస్‌లో నాలుగు రోజుల పాటు జరిగే వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. వరల్డ్ ఎకనమిక్ ఫోరం వేదికగా తెలంగాణకు ఉన్న సానుకూలతలను చాటి చెప్పి పెట్టుబడులను తెచ్చే లక్ష్యంతో సీఎం రేవంత్ రెడ్డి బృందం దావోస్ పర్యటనకు వెళ్లింది. పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యంగా దావోస్ లో రేవంత్ రెడ్డి పర్యటన కొనసాగుతుంది. ప్రపంచ అగ్రశ్రేణి పరిశ్రమలు, సంస్థల అధినేతలతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భేటీకానున్నారు. పెట్టుబడుల గమ్యస్థానంగా తెలంగాణను ప్రపంచానికి పరిచయం చేసేందుకు దావోస్ పర్యటనను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావిస్తోంది. గత ఏడాది దావోస్ పర్యటన సందర్భంగా రాష్ట్రానికి రూ.40 వేల కోట్ల పెట్టుబడులను ప్రభుత్వం సమీకరించింది. ఈసారి అంతకు మించి పెట్టుబడులను తేవడమే లక్ష్యంగా తమ పర్యటన కొనసాగుతుందని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల అధికారులతో సమీక్షలో వెల్లడించారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, రాష్ట్రంలో చేపడుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులతో అంతర్జాతీయ దిగ్గజ కంపెనీలు పెట్టుబడులకు ఆసక్తి ప్రదర్శిస్తాయనే ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు హైదరాబాద్ అడ్డాగా మారింది. ఐటీ, ఏఐ, ఫార్మా, తయారీ రంగాలకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతోపాటు ఇటీవల ప్రకటించిన పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి విధానం (క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ)పై ప్రముఖ కంపెనీలు ఆసక్తి ప్రదర్శిస్తున్నాయి. గత ఏడాది దావోస్ పర్యటనతోపాటు అమెరికా, దక్షిణ కొరియా పర్యటనలతో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వచ్చాయి. కాగా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో మరో భారీ ఐటీ పార్కు ఏర్పాటు కానుంది. రూ.450 కోట్లతో కొత్త ఐటీ పార్కును ఏర్పాటు చేసేందుకు సింగపూర్‌కు చెందిన క్యాపిటల్ ల్యాండ్ కంపెనీ ముందుకు వచ్చింది. సుమారు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ ఐటీ పార్కును ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. దావోస్ వేదికగా మంగళవారం నుంచి నాలుగు రోజులపాటు జరిగే 'ప్రపంచ ఆర్థిక ఫోరం' వార్షిక సదస్సులో ఈ బృందం పాల్గొననుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కంపెనీలు ఈ సదస్సుకు హాజరు కానున్న నేపథ్యంలో.. ఆ వేదికపై తెలంగాణలో కంపెనీల ఏర్పాటుకు ఉన్న అనుకూలతలను వివరించి, హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా పరిచయం చేయనున్నారు.

# కర్మభూమితో పాటు జన్మభూమికి పాటుపడండి

(మొదటి తరువాయి)

ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్ వెళ్లిన ఆయన జ్యూరిచ్‌లో అక్కడి పారిశ్రామికవేత్తలతో భేటీ అయ్యారు. యూరప్‌లోని 12 దేశాల నుంచి వ్యాపారవేత్తలు ఈ సమావేశానికి రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తాను బిల్‌గేట్స్‌ను కలవడం ద్వారా హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ వచ్చిందని, సత్యనాదెళ్ల లాంటి వారు ఇప్పుడు సిఇవో అయ్యారని చంద్రబాబు అన్నారు. తాను ఐటి గురించి మాట్లాడితే అంతా ఆశ్చర్యంగా చూశారని, కాని ఇవాళ ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు దూసుకు పోతున్నారని అన్నారు. ఎపిలో ఇప్పుడు అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అన్నారు. 2004లో అధికారం కొనసాగివుంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ఎపిలో గత ఐదేళ్లలో విధ్వంసం సాగిందన్నారు. తాను విజన్ 2047తో ముందుకు వెళుతున్నానని అన్నారు. ప్రధాని మోడీ దేశం కోసం వికసిత్ భారత్‌తో కృషి చేస్తున్నారని అన్నారు. ప్రపంచంలోని అన్ని దేశాల్లోనూ తెలుగువారుంటారని, అవకాశం ఉన్న ప్రతిచోటుకీ మనవాళ్లు వెళ్లిపోతారని చెప్పారు. 'అన్ని దేశాల్లో తెలుగువాళ్ల ఫుట్ ప్రింట్ ఉంటుంది. అదే మన గొప్పతనం. తెలుగువాళ్లు ఎక్కడైనా గొప్పగా పని చేస్తారు. రాణిస్తారు. పట్టుదల ఎక్కువ. నైపుణ్యాలు పెంచుకుంటారు. నేను జైల్లో చేసిన న్యాయ పోరాటానికి మద్దతుగా నిలిచారు. అప్పుడు ఇన్ని దేశాల్లో తెలుగువాళ్లు ఉన్నారా? అని ఆశ్చర్యపోయా. మరో జన్మ ఉంటే తెలుగువాడిగానే పుట్టించాలని దేవుడిని కోరుకుంటున్నా. యువతలో సరికొత్త ఆలోచనలు రావాలి. చైతన్యవంతులు కావాలి' 'ఆ రోజుల్లో ఐటీకి ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చా. అనేకమంది యువత గ్రామాల నుంచి నగరాలకు వచ్చి ఇంజినీరింగ్ విద్యను అభ్యసించి, ఐటీ రంగంలోకి వచ్చారు. హైదరాబాద్‌లో భూములు అమ్ముకోవద్దని అనేకమందికి చెప్పా. ఇక్కడి భూములకు మంచి ధర వస్తుందని ఆనాడే చెప్పా. తెలంగాణలో అత్యధిక తలసరి ఆదాయానికి హైదరాబాద్ సంపదే కారణం. చదువులో ఆడపిల్లలపై వివక్ష చూపించొద్దని ఆనాడే చెప్పాను. ఇప్పుడు ఏ ఐటీ కంపెనీకి వెళ్లినా అమ్మాయిలు కనిపిస్తున్నారు.

# అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణం

(మొదటి తరువాయి)

1861లో అబ్రహాం లింకన్ ప్రమాణ స్వీకారం చేయడానికి ఉపయోగించిన బైబిల్, తన బైబిల్‌ను చేతిలో పట్టుకొని ట్రంప్ బాధ్యతలు స్వీకరించారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణ స్వీకారం చేశారు. దేశ, విదేశీ అతిథులతో క్యాపిటల్ హిల్ రోటుండా కిటకిటలాడింది.

ప్రమాణస్వీకారోత్సవానికి ముందు జో బైడెన్‌ను కలిసేందుకు ట్రంప్ శ్వేత సౌధానికి వెళ్లగా.. ఆయనకు బైడెన్ దంపతులు సాదరస్వాగతం పలికారు. పరస్పరం కరచాలనం చేసుకున్నారు. అనంతరం శ్వేతసౌధం

నుంచి వాషింగ్టన్ డీసీ క్యాపిటల్ హిల్‌లోని రోటుండా ఇండోర్‌లో జరిగే ప్రమాణస్వీకారోత్సవానికి జో బైడెన్, ట్రంప్ ఒకే వాహనంలో వెళ్లారు. భారత్ తరఫున ఈ ప్రమాణస్వీకారోత్సవానికి కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ హాజరయ్యారు. ప్రధాని నరేంద్ర మోదీ తరఫున హాజరైన జైశంకర్.. ట్రంప్‌నకు మోదీ రాసిన లేఖను అందజేసారు. మెరికా అధ్యక్షుడి ప్రమాణస్వీకార వేడుకకు భారత్ తరఫున ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం తనకు దక్కిందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకకు ముకేశ్ అంబానీ దంపతులు సైతం హాజరయ్యారు. పలువురు అమెరికా మాజీ అధ్యక్షులు సతీసమేతంగా ఈ వేడుకకు విచ్చేశారు. బిల్ క్లింటన్, హిల్లరీ క్లింటన్, జార్జి డబ్ల్యూ బుష్, లారా బుష్ తదితరులు విచ్చేశారు. బరాక్ ఒబామా హాజరైనప్పటికీ మిచెల్లీ ఒబామా మాత్రం ఈ వేడుకకు రావడంలేదని ముందే ప్రకటించారు. అమెరికా సుప్రీంకోర్టుకు చెందిన తొమ్మిది మంది జడ్జిలు ఈ వేడుకకు హాజరయ్యారు. ట్రంప్ క్యాబినెట్‌లో చోటు దక్కించుకున్న నేతలతో పాటు వివేక్ రామస్వామి, టెస్లా అధిపతి ఎలాన్ మస్క్, జెఫ్ బెజోస్, మార్క్ జుకర్ బర్గ్, టిమ్ కుక్, సుందర్ పిచాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల కోసం మరో అవకాశం

(మొదటి తరువాయి)

ఆదేశించారు సీఎస్ శాంతి కుమారి. దీనికి సంబంధించి గైడ్స్ లైన్స్ తో సర్క్యులర్ పంపించారు. గ్రామ సభల్లో కొత్త రేషన్ కార్డులతో పాటు ఇప్పటికే ఉన్న కార్డుల్లో పేర్లు చేర్చడానికి దరఖాస్తులు స్వీకరించాలి. ఒకే కుటుంబం నుంచి వేరే పడ్తున్న కుటుంబాలకు కొత్త కార్డులు ఇచ్చేందుకు అప్లికేషన్లు తీసుకోవాలి. కుటుంబ పెద్దతో పాటు ఇతర కుటుంబ సభ్యుల వివరాలు, వారి ఆధార్ కార్డులు, కులం, మొబైల్ నంబర్, చిరునామా వంటి వివరాలను తీసుకోవాలని గైడ్ లైన్స్ లో స్పష్టం చేశారు.

# రాహుల్ గాంధీకి ఊరట

(మొదటి తరువాయి)

మంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారు. అమిత్ షా ఓ హత్య కేసులో నిందితుడని రాహుల్ ఆరోపించారు. ఆ ఘటనలో రాహుల్‌పై క్రిమినల్ డిఫమేషన్ కేసు బుక్ చేశారు. రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ కార్యకర్త నవీన్ ఝా పరువునష్టం కేసు దాఖలు చేశారు. దీనిపై ట్రయల్ కోర్టు విచారణ జరిపింది. విచారణ సందర్భంగా వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇవ్వాలన్న రాహుల్ అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. దీంతో రాహుల్.. జార?ండ్ హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ఈ విషయంలో జోక్యం చేసుకోవడానికి జార?ండ్ కోర్టు నిరాకరించింది. దీంతో రాహుల్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. క్రిమినల్ పరువునష్టం కేసుకు సంబంధించి ట్రయల్ కోర్టులో తనపై విచారణను రద్దు చేయాలని క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన దేశ అత్యున్నత న్యాయస్థానం.. ట్రయల్ కోర్టులో ఈ కేసు విచారణపై స్టే విధించింది. ఈ మేరకు జార్ఖండ్ ప్రభుత్వానికి, బీజేపీ నేత నవీన్ ఝూకు నోటీసులు జారీ చేసింది. నాలుగు వారాల్లోగా సమాధానాలు ఇవ్వాలని న్యాయస్థానం ఆదేశించింది.

# చిన్మయ్ కృష్ణ దాస్‌కు మరోసారి నిరాశ

(మొదటి తరువాయి)

సోమవారం నాడు విచారణకు రాలేదు. వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం ఉందని ఆయన తరఫు న్యాయవాది తెలిపారు. చిన్మయ్ బెయిలు పిటిషన్‌ను చిట్టగాండ్‌లోని దిగువ కోర్టు జనవరి 2న తోసిపుచ్చింది. దీనిపై ఆయన హైకోర్టును ఆశ్రయించారు. కాగా, చిన్మయ్ కృష్ణ దాస్‌కు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ జనవరి 12న హైకోర్టులో పిటిషన్ వేశామని, 20న విచారణకు రావాల్సి ఉందని ఆయన తరఫు న్యాయవాది చెప్పారు. అయితే, పెండింగ్ కేసులను సీరియల్ ప్రకారం కోర్టు విచారణ జరుపుతుందని, ఆ ప్రకారం వచ్చే వారం కేసు విచారణకు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఇలాంటి కేసులను ఆది, సోమవారాల్లో మాత్రమే హైకోర్టు విచారణ జరుపుతుందని చెప్పారు. ఇస్కాన్' మాజీ ప్రచారకర్తగా ఉన్న చిన్మయ్ దాస్‌ను గత ఏడాది నవంబర్ 25న ఢాకాలోని హజ్రత్ అంతర్జాతీయ విమానాశ్రయంలో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆ మరుసటి రోజు కోర్టు ముందు హాజరుపరిచారు. బంగ్లాదేశ్ జాతీయ జెండాను అగౌరవపరిచారంటూ చిన్మయ్‌పై దోశద్రోహం కేసు నమోదు కావడంతో ఆయనకు బెయిల్ ఇచ్చేందుకు కోర్టు నిరాకరించింది. జైలుకు పంపుతూ ఆదేశాలిచ్చింది. దీంతో కోర్టు వెలువల ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆయనను విడిచిపెట్టాలంటూ హిందూ అనుకూల వాదులు, ఆయన అనుయాయులు ఆందోళనకు దిగారు. దీంతో వారికి, పోలీసులకు మధ్య ఘర్షణ నెలకొంది. చిన్మయ్ అరెస్టుకు వ్యతిరేకంగా ఢాకా, ఇతర ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి.

# సఫాయి అన్నకు సలాం కొట్టిన ఒకే ఒక్కడు కేసీఆర్

(మొదటి తరువాయి)

ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ తెలిపారు. సఫాయి అన్న.. నీకు సలాం అన్న సీఎం ఈ దేశంలో ఎవరూ లేరు.. కేవలం కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం క్యాలెండర్ ఆవిష్కరణ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ హమాలీలు, ఆటో డ్రైవర్ల కోసమే కాదు.. అందరి కోసం పని చేశారు. కార్మికుల ఇబ్బందులు, చికాకులు పరిష్కరించేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. జీహెచ్ఎంసీలో సఫాయి కార్మికులకు మూడు సార్లు జీతాలు పెంచారు. తెలంగాణ ఏర్పడక ముందు నాటి ప్రభుత్వాలు అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం వారిని పెద్ద మనసుతో ఆశీర్వదించింది. అంగన్‌వాడీల జీతం రూ. 4500 ఉంటే రూ. 13650కు పెంచారు. మినీ అంగన్‌వాడీలకు రూ. 2200 ఉంటే రూ.7800 చేశారు. ఇటీవల హైదరాబాద్ నగరంలో ఆశా వర్కర్ల పట్ల పోలీసుల అసభ్యంగా ప్రవర్తించారు. సీఎం రేవంత్ రెడ్డి మాదిరిగానే పోలీసులు కూడా ప్రవర్తించారు. ఆశావర్కర్లకు జీతాలు రూ. 2500 ఉంటే రూ. 9750 దాకా తీసుకువెళ్లాం. ఉపాధి హామీలో పని చేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు కూడా జీతాలు పెంచినం. అన్ని రంగాల్లో పని చేసే కార్మికులను గుండెల్లో పెట్టుకున్నామని కేటీఆర్ తెలిపారు. హెూంగార్డుల విషయం బాధాకరం. మొన్న ఒక హెూంగార్డు కలిసి కళ్లల్లో నీళ్లు పెట్టుకున్నడు. రూ. 9 వేలు ఉండే జీతాన్ని రూ. 25 వేలు చేసిండు కేసీఆర్.. ఆయన దేవుడు. ఎందుకు ఓడగొట్టారు. ఆయన ఉంటే మాకు ఇంకా లాభం జరిగేది. పోలీసులతో సమానంగా పే స్కేలు వచ్చేది.. మూడు పూటల అన్నం తింటున్నాం అంటే కేసీఆర్ పుణ్యమే అని ఆ హెూంగార్డు చెప్పి బాధపడ్డాడని కేటీఆర్ గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు 73 శాతం వేతనాలు పెంచారు. దేశంలో అత్యధిక జీతాలు పొందుతున్న ఉద్యోగులు తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులే. ఇది చిన్న విషయం కాదు. కాంట్రాక్టర్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు పీఆర్సీ వర్తింపజేశాం. అలాగే నాలుగున్నర లక్షల మంది బీడీ కార్మికులకు పెన్షన్లు ఇచ్చాం. 26 లక్షల మంది ప్రయివేటు డ్రైవర్లకు 5 లక్షల జీవిత బీమా ఇచ్చారు కేసీఆర్. వైద్య రంగం, మున్సిపల్ రంగంలో జీతాలు పెంచుకుంటూ పోయామని కేటీఆర్ తెలిపారు.

## తెలుగు పంచాంగం 21 /1/2025, మంగళవారం

సమయ సమాచారం
సూర్యోదయం: ఉదయం 6:50
సూర్యాస్తమయం: సాయంత్రం 6:03
తిథి
కృష్ణ పక్ష సప్తమి
ప్రారంభం: జనవరి 20 రాత్రి 11:48
ముగింపు: జనవరి 22 ఉదయం 1:10
నక్షత్రం
మృగశిర
ప్రారంభం: జనవరి 20 రాత్రి 3:30
ముగింపు: జనవరి 21 రాత్రి 5:45
శుభ సమయాలు
అమృతకాలం: సాయంత్రం 4:55 నుండి 6:30 వరకు
అభిజిత్ ముహూర్తం: మధ్యాహ్నం 12:00 నుండి 12:44 వరకు
అశుభ సమయాలు
రాహుకాలం: మధ్యాహ్నం 3:06 నుండి 4:28 వరకు
యమగండం: ఉదయం 9:34 నుండి 10:56 వరకు
దుర్ముహూర్తం:
ఉదయం 9:13 నుండి 9:55 వరకు
మధ్యాహ్నం 12:44 నుండి 1:26 వరకు
వర్జ్యం: రాత్రి 9:40 నుండి 11:20 వరకు
పండితుల సూచన
మంగళవారం విశేషంగా అంజనేయ స్వామి పూజకు అనుకూలమైనది. హనుమాన్ చాలీసా పఠనం, సుంధర కాండ పారాయణం చేయడం వల్ల అడ్డంకులు తొలగి శక్తి, ధైర్యం కలుగుతాయి.

# సంస్కారాన్ని నేర్పేది విద్య మాత్రమే

-మంత్రి జూపల్లి కృష్ణారావు.
-రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
-జిల్లా గ్రంథాలయ ఛైర్మెన్ మధుసూదన్ రెడ్డి హాజరయ్యారు



**షాద్ నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మంత్రి జూపల్లి మాట్లాడుతూ..... నేటి సమాజంలో, ప్రస్తుత పరిస్థితుల్లో సంస్కారం నేర్పేది విద్య మాత్రమే అన్నారు. గ్రంథాలయాల్లో మహనీయుల పుస్తకాలు ఉండాలన్నారు. అభివృద్ధి కి నిధులు కేటాయించినప్పుడు అందులో నుండి 10% గ్రంథాలయాలకు ఉపయోగించాలన్నారు. ప్రతి గ్రామాన గ్రంథాలయాలు ఏర్పాటు దిశగా పని చేయాలన్నారు. యువత చెడు అలవాట్లకు, మొబైల్స్ లో సమయం వృధా చేయడం మానేసి గ్రంథాలయాల్లో పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కోట్ల ఖర్చుతో విగ్రహాల ఏర్పాట్ల పై శ్రద్ధ కన్నా విద్య పై, గ్రంథాలయాలపై పెట్టాలన్నారు. సాంస్కృతిక శాఖ తరపున గ్రంథాలయానికి 5 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రొఫెసర్ కోదండరాం మాట్లాడుతూ..... గ్రంథాలయంలో విద్యార్థులకు పోటీ పరీక్షలకు అవసరమయ్యే పుస్తకాలను ఏర్పాటు చేయాలన్నారు. పుస్తకాలు కొనుక్కోవడం వీలు కానీ పేద విద్యార్థులకు గ్రంథాలయాలు ఆసరాగా ఉండాలన్నారు. వర్తమాన అంశాలపై గ్రంథాలయంలో విద్యార్థులకు లెక్చర్లు ఏర్పటు చేయాలన్నారు.

## వేద పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించిన డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్.వి విజయలక్ష్మి




**షాద్ నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
ఈరోజు ప్రాథమిక ఆరోగ్య కేంద్రము చించోడు, సబ్ సెంటర్ కిషన్ నగర్ ఏరియా లోని శ్రీ జగద్గురువు పంచాచార్య వీర శైవ ఆగమ పాఠశాలలోని వేద పండితము నేర్చుకుంటున్నా విద్యార్థులకు షాద్నగర్ డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి.విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరము నిర్వహించడం జరిగింది. ఈ పాఠశాలలో చదువుతున్న 105 మంది విద్యార్థులలో, 95 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి, వారిలో జలుబు, దగ్గు మరియు జ్వరం ఉన్న వారికి కావలసిన మందులను ఇవ్వడం జరిగింది. ఇందులో 33 మంది విద్యార్థులకు ల్యాబ్ పరీక్షలు నిర్వహించడం జరిగింది అని డాక్టర్ వి విజయలక్ష్మి గారు తెలియజేశారు. తదుపరి జె. శ్రీనివాసులు హెల్త్ ఎడ్యుకేటర్ మాట్లాడుతూ విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి, హ్యాండ్ వాష్ గురించి మరియు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్.ఎల్.హెచ్.పి వైద్య అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టరు ముస్తాక్ హమ్మద్, హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ శ్రీ రమ, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్ , ఏఎన్ఎం సుగుణ మరియు ఆశలు పాల్గొన్నారు.

# నేత్రదానం చేయండి మరో మారు జీవించండి

-మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర




**ఆమనగల్లు, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
రంగారెడ్డి జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ కళావతి ఆదేశానుసారంగా లయన్స్ క్లబ్ అఫ్ ఆమనగల్లు రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రి వారి సంయుక్త ఆధ్వర్యంలో ఆమనగల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ పరీక్షిత్ నరేంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నేత్రదానం చేసి మరోమారు జీవించాలని నేత్రదానం మహాదానమని నేత్రదానం చేసి మరో ఇద్దరికి దృష్టి భాగ్యం కల్పించిన వారు అవుతారని ఆయన పిలుపునిచ్చారు. కంటి వైద్యులు ఎం. చంద్రశేఖర్ గారి ఆధ్వర్యంలో పాఠశాలలో, గ్రామాల్లో గాని ఆశా వర్కర్ల ద్వారా మండల పరిసర గ్రామ ప్రాంతాలలో నేత్ర వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలను అవగాహన కల్పించి నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చే విధంగా చైతన్య కలుస్తామని ఆయన పిలుపునిచ్చారు. ఈ శిభిరంలో కంటి వైద్యులు ఏం చంద్రశేఖర్ 65 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా అందులో 22 మందిని ఐ ఒ ఎల్ ఆపరేషన్ నిమిత్తం రామ్ రెడ్డి లయన్ ఐ ఆసుపత్రికి తరలించినట్లు పిఆర్ఓ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సంయుక్త కార్యదర్శి ఎంగలి బాలకృష్ణ, క్లబ్ పి ఆర్ ఓ ఎం ఏ పాష, క్లబ్ సభ్యులు కొర్వి వెంకటయ్య, హెల్త్ సూపర్వైజర్ తిరుపతిరెడ్డి, డిఇఓ విష్ణు, ఆస్పత్రి సిబ్బంది తదితరు పాల్గొన్నారు.

# ఘనంగా మంద జగన్నాథం దశదిన కార్యక్రమం



**హైదరాబాద్, జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హైదరాబాద్ పట్టణంలోని హస్తినాపూర్‌లో కె. కె గార్డెన్ లో నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ కీ.శే. డా. మంద జగన్నాథం దశదిన కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తలకొండపల్లి, ఆమనగల్లు మండల నేతలు హాజరై ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు మాట్లాడుతూ, మంద జగన్నాథం మరణం తెలంగాణ ఒక సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని, పాలమూరు జిల్లా రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారని అన్నారు. నాలుగు సార్లు ఎంపీగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో దళిత బహుజన సీనియర్ నాయకులు వస్పుల జంగయ్య, జి.సూదకర్, తలకొండపల్లి మాజీ ఎంపిపి లక్ష్మీదేవి రఘురాములు, తలకొండపల్లి మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య, పేరుమల్ల నరసింహ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఇబ్రహీంపట్నం నియోజకవర్గం లో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలి


-ఇబ్రహీంపట్నం ప్రజావాణిలో అర్జీ జర్నలిస్ట్ యూనియన్ నాయకులు లక్ష్మయ్య



**యాచారం,జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్ ) :**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని అన్ని మండలాలలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని జర్నలిస్ట్ సంఘం నాయకులు లక్ష్మయ్య ప్రజావాణిలో ఆర్డిఓ. అనంతరెడ్డికి వినతి పత్రం.ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో. జర్నలిస్టులకు చోటు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నో సంవత్సరాల నుండి నిరుపేదలుగా ఉంటూ జర్నలిస్టు వృత్తిలో పనిచేస్తున్న ప్రతి జర్నలిస్టుకు ప్రత్యేకంగా జిల్లా కలెక్టర్ స్థానిక ఎమ్మెల్యే చొరవ తీసుకొని ప్రతి రిపోర్ కు ఇంద్రం బిల్లు మంజూరు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం ఇండస్థలాలు ఇచ్చి అట్టి స్థలాలలోనే. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు.

# అంగరంగ వైభవంగా వేణుగోపాలస్వామి కళ్యాణం

-కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే



**ఫరూఖ్ నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఫరూఖ్ నగర్ మండలం దేవుని పల్లి గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాల స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ , మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరయ్యారు. కళ్యాణ మహోత్సవ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలను గ్రామస్తులు మరియు ఆలయ కమిటీ సాదరంగా ఆహ్వానించి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాజీ ఎమ్మెల్యే అత్యంత భక్తిశ్రద్ధలతో కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ కలియుగ వైకుంఠధాముని ప్రతిరూపమైన వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, ఆ భగవంతుని దయవలన నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని, కళ్యాణ మహోత్సవంలో పాల్గొనడం తమ పూర్వజన్మ సుకృతమని, ప్రజలందరూ ఆ దేవుని కరుణాకటాక్షాల వలన చల్లగా ఉండాలని, ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో ప్రజలందరూ తులతూగాలని కళ్యాణోత్సవంలో ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ, అర్చక పురోహితులు, దేవునిపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధి నా ప్రధాన లక్ష్యం

- ఎమ్మెల్యే బాలు నాయక్



**చింతపల్లి, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):**
చింతపల్లి మండల పరిధిలోని మాల్ గోడకొండ్ల, VT నగర్ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై, సీసీ రోడ్డు నిర్మాణ పనులను శంకుస్థాపన చేసిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేవరకొండ నియోజకవర్గ అభివృద్ధియే తన ప్రధాన లక్ష్యమని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలోనే పేదలకు సేవ చేయాలనే సంకల్పంతో ప్రతి గ్రామం నుండి మండల కేంద్రానికి సీసీ రోడ్డు & బీటీ రోడ్లు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. తాను శాసన సభ్యునిగా గెలిచిన అనతి కాలంలోనే దేవరకొండ నియోజకవర్గంలో అన్ని మండలాలను అభివృద్ధి చేసేందుకు తాను శాయశక్తుల కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. అదేవిధంగా అన్ని గ్రామాలలో మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని అన్నారు.

# మైనింగ్ తవ్వకాలకు వ్యతిరేకంగా మైలారం గ్రామస్తుల ఆందోళన



**బల్మూర్, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
బల్మూరు మండల పరిధిలోని మైలారం గ్రామంలో గుట్టపై మైనింగ్ తవ్వకాలను ఆపాలని రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచెలు వేసి గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. మైనింగ్ కార్యకలాపాలు బలవంతంగా కొనసాగిస్తే పురుగుల మందు తాగి చనిపోతామని గ్రామస్తులు హెచ్చరిస్తున్నారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులలో కొందరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అక్రమంగా అరెస్టులు చేయవద్దని, అరెస్టు చేసిన వారిని వదిలిపెట్టాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ




**తలకొండపల్లి, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో జనవరి 7, 8, 9 తేదీల్లో జరుగనున్న శ్రీ శ్రీ వేదాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి ఆలయ ధర్మకర్త జి. శ్రీనివాస్ మూర్తి చేతుల మీదుగా ఆహ్వాన పత్రిక ఆవిష్కరించడం జరిగింది. ఈ ఆహ్వాన కార్యక్రమం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో జరిగింది. బ్రహ్మోత్సవాలకు శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డిని ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకట్ రెడ్డి, సి. చెన్నారెడ్డి, పి. అశోక్ బాబు, పి. నర్సింలు, ఎంఏ అజిజ్, మండల కాంగ్రెస్ మైనార్టీ సెక్షన్ ఎండి ఆరిఫ్, ఎండి రహీం, ఆమనగల్ మాజీ వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, కల్లు పెంటారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# దశదిన కర్మకు హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు నారోజు కుమారస్వామి



**యాచారం,జనవరి 20 ( నీలగిరి ఎక్స్ ప్రెస్)**
సామిల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మారోజు వెంకటా చారి మాతృమూర్తి మారోజు అనంతమ్మ దశదిన కర్మ సందర్భంగా వారి స్వగ్రామమైన రంగారెడ్డి జిల్లా యాచారం గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై అనంతమ్మ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నారోజు కుమారస్వామి చారి. ఈ కార్యక్రమంలో బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేష్ చారి, రాష్ట్ర సీనియర్ నాయకులు నారోజు సత్యనారాయణ చారి, నాగారం భాస్కరా చారి, నాదర్ గుల్ విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి గన్నోజు రాజు చారి, విశ్వబ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి బండికట్ల వెంకటేశ్వర చారి తదితరులు పాల్గొన్నారు.

# కల్వకుర్తి పట్టణంలో జాతీయ రోడ్డు భద్రత వార్షికోత్సవాలు




**కల్వకుర్తి, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
జాతీయ రోడ్డు భద్రత వార్షికోత్సవాల కార్యక్రమాన్ని కల్వకుర్తి పట్టణంలో సోమవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పోలీస్ స్టేషన్ నుంచి మహబూబ్నగర్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని, ప్రతి ఒక్కరూ భద్రత పరిమాణాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యులు బాలాజీ సింగ్, పోలీస్ శాఖ ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆగపల్లిలో ప్రభుత్వ భూమిని కాపాడండి

-తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్
-ప్రజావాణి లో కలెక్టర్ కి ఫిర్యాదు








**మంచాల,జనవరి 20 ( నీలగిరి ఎక్స్‌ప్రెస్ ) :-**
ఆగపల్లిలో ఎస్.ఆర్ గ్రూప్ అక్రమ వెంచర్ పై చర్యలు తీసుకోని ప్రభుత్వ భూమిని కాపాడలని తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షులు గోడుకొండ్ల ప్రవీణ్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డి కి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గోడుకొండ్ల ప్రవీణ్ మట్లాడుతూ రంగారెడ్డి జిల్లా మంచాల మండలం ఆగపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 191 లో గల 2.22 గుంటల ప్రభుత్వ భూమి,సర్వే నెంబర్ 187 లో గల 33.10 గుంటల భూముల్లో కొంత భాగం ఎస్సార్ గ్రూప్ వెంచర్ వాళ్ళు కబ్జా చేసి పార్కు కోసం కేటాయించారని గతంలోనే ఎన్నోసార్లు అధికారుల దృష్టికి,కలెక్టర్ దృష్టికి తెచ్చిన రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి ఇది ప్రభుత్వ భూమిగా వెంచర్లో కొంత భాగం కబ్జా చేసినట్టు తేల్చి ప్రభుత్వ భూమిని కబ్జా చేసిన వారిపై కఠిన చర్యలు తప్పవని సూచిస్తూ రెవెన్యు అధికారులు హెచ్చరిక బోర్డును కూడా ఏర్పాటు చేశారు అని అన్నారు. కాలక్రమేన వెంచర్ యజమానులు బోర్డుని తొలగించి రోడ్డు పనులను కొనసాగించారని అధికారుల సూచనలను బేఖాతారు చేసి ప్లాట్లు అమ్మడానికి వెంచర్ పనులు వేగవంతం చేస్తున్నారని దీంతో అధికారుల కనుసనల్లోనే ఈ నిర్వాకం జరుగుతోందని ఆరోపించారు. దీనికి ప్రధాన కారణం అందేల శ్రీరాములు బినామీ సామంత రెడ్డి 4.20 ఎకరాల అసైన్డ్ భూమిని కబ్జా చేసి ఫ్లాట్లుగా విక్రయిస్తున్నారని దీంతో అధికారుల అలసత్వం స్పష్టంగా కనిపిస్తుందని 20 రోజుల్లో మళ్లీ సర్వే చేసి ప్రభుత్వ భూమి హద్దులు ఏర్పాటు చేయకపోతే పోరాటం ఉధృతం చేస్తామని తెలంగాణ భూముల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆమరణ నిరాహార దీక్షకైనా సిద్ధమని తెలంగాణ భూముల పరిరక్షణ సమితి అధ్యక్షుడు గోడుకొండ్ల ప్రవీణ్,కమిటీ సభ్యులు దూసరి లక్ష్మణ్ లు సోమవారం కలెక్టర్ కి ప్రజావాణి ద్వారా మరోసారి విజ్ఞప్తిగా వినతిపత్రం అందజేశారు.

# నరేంద్రమోదీ సంక్షేమ పాలనే రాజ్యాంగానికి ప్రతీక

– బిజెపి జిల్లా అధ్యక్షులు డి.నారాయణ



**వనపర్తి, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :**
భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంక్షేమ పాలనే రాజ్యాంగానికి ప్రతికా అని వనపర్తి జిల్లా బిజెపి అధ్యక్షులు డి నారాయణ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని లక్ష్మీ కృష్ణ గార్డెన్స్ లో బిజెపి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యాశాల నిర్వహించారు. కార్యాశాలలో బిజెపి జిల్లా అధ్యక్షుడు డి.నారాయణ మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ 2015 నవంబర్ 26న తొలిసారి రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి ప్రతిఏటా క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నామని దేశంలోని 140 కోట్ల మంది ప్రజలకు రాజ్యాంగం పవిత్రమైనది సర్వోన్నతమైనదని, శీతాకాల పార్లమెంటు సమావేశాల్లో లోక్ సభ రాజ్యసభలో రాజ్యాంగంపై ప్రత్యేక చర్చ జరిగిందని ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ గౌరవార్థం పంచ తీర్థలు జన్మస్థలం-మావు మహారాష్ట్ర, శిక్షా భూమి లండన్,దీక్షా భూమి నాగపూర్, చైతన్య భూమి ముంబై మరియు మహాపరినిర్వాన్ ఢిల్లీ లను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. రాజ్యాంగం వర్తమానానికి , భవిష్యత్తుకు మార్గదర్శని నేటి ప్రతి పౌరుడి ఏకైక లక్ష్యం అభివృద్ధి చెందిన భారతదేశాన్ని నిర్మించడమే నన్న మోదీ మాటలను ఆచరణలోకి తీసుకురావాలని పిలుపునిచ్చారు. జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, రాష్ట్ర రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సబిరెడ్డి వెంకటరెడ్డి, ఓబిసి మోర్చా రాష్ట్ర నాయకులు బీ.శ్రీశైలం మాట్లాడుతూ ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి రాజ్యాంగాన్ని అందించిన రాజ్యాంగ నిర్మాత డా. బి.ఆర్ అంబేద్కర్ ని పార్లమెంటుకు వెళ్లకుండా కాంగ్రెస్ ఓడించిందని దేశాన్ని అత్యధిక ఏళ్లు పరిపాలించిన కాంగ్రెస్ అంబేద్కర్ కు భారతరత్న ఇవ్వలేదని బిజెపి మద్దతుతో జనతా ప్రభుత్వంలో బి.ఆర్ అంబేద్కర్ కు భారతరత్న ఇచ్చారని రాజ్యాంగబద్ధ పాలన కేవలం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తోనే సాధ్యమని స్పష్టం చేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు గణతంత్ర దినోత్సవం వరకు పార్టీ తరఫున అనేక కార్యక్రమాలు శ్రీకారం చుడుతున్నామని అన్నారు. జనవరి 20%ఉ%21 తేదీ లలో జిల్లాల వారీగా సంవిధాన్ గౌరవ అభియాన్ కార్యాశాల నిర్వహణ. 22 23 తేదీలలో ఎస్సీ ఎస్టీ బస్తీలలో సమావేశాల నిర్వహణ. 24 & 25 తేదీలలో కళాశాలలు ఎస్సీ ఎస్టీ బీసీ హాస్టల్ల సంపర్క్ రాజ్యాంగం పట్ల బీజేపీ నిబద్ధతను యువతకు వివరించాలి. 26న ప్రతి పోలింగ్ బూత్ లో గణతంత్ర దినోత్సవం జరుపుకోవడం, భారత రాజ్యాంగంలోని ప్రవేశిక మరియు ఆదేశిక సూత్రాలను చదివి వినిపించాలనీ నిర్ణయించామన్నారు.
కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ రామన్ గౌడ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు చిత్తారి ప్రభాకర్, యువ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కదిరే మధు, జిల్లా ఉపాధ్యక్షులు బండారు కుమారస్వామి, శ్రీమతి సుమిత్రమ్మ, కార్యదర్శి కే శివారెడ్డి, ముప్పూరి చెన్నయ్య, జిల్లా అధికార ప్రతినిధి గజరాజుల తిరుమలేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలు అశ్విని రాధ, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గంధం ప్రవీణ్, పట్టణ అధ్యక్షులు రాజశేఖర్ గౌడ్, మోర్చాల నాయకులు కృష్ణ గౌడ్, నరసింహనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి రాయన్న సాగర్, మండల అధ్యక్షులు విష్ణువర్ధన్ కావలి, క్రాంతి నాయుడు, బాలు నాయక్, పట్టణ యువమోర్చా అధ్యక్షులు ఎద్దుల రాజు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల కోసం విస్తృత ఏర్పాట్లు

– జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



**రంగారెడ్డి, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు, అర్హులందరికి రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ, రేషన్ కార్డుల జారీ వంటి ప్రక్రియల కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని. జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, సీఈఓ కృష్ణ రెడ్డి, ఆర్ డి ఓలు, తహసీల్దార్లు, వ్యవసాయ శాఖ అధికారులు, సివిల్ సప్లై, ఎంపిడిఒలు, వ్యవసాయ అధికారులు, ఎంపీవోలు, మున్సిపల్ కమిషనర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సర్వే పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఈ నెల 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలకు విస్తృత ఏర్పాట్లు చేయాలని, ప్రతి గ్రామ సభకు కనీస మౌలిక సదుపాయాలను కల్పించాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డ్ లు జారీ చేస్తామని, రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇండ్ల పథకం నిరంతరం ప్రక్రియ అని పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను పరిశీలిస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 26 నుండి ప్రతిష్టాత్మకంగా నాలుగు సంక్షేమ పథకాలు ప్రారంభించబోతుందని, గ్రామ సభల్లో దరఖాస్తులను స్వీకరించడంతో పాటు, ప్రజాపాలన సేవా కేంద్రాల్లో కూడా దరఖాస్తులను స్వీకరిస్తామని తెలిపారు. గ్రామ సభల్లో దరఖాస్తులను స్వీకరించేటప్పుడు కుటుంబ యజమాని నంబర్, పేర్లు, ఆధార్ నెంబర్, మొబైల్ నెంబర్, అడ్రస్ తీసుకోవాలని సూచించారు. రేషన్ కార్డులకు సంబంధించి ప్రతిదీ రిజిష్టర్ లో నమోదు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి జాబితాలను ప్రదర్శించాలని సూచించారు. జిల్లాలో అర్హులైన ప్రతీ ఒక్కరికీ రేషన్ కార్డులు జారీ చేస్తామని, వ్యవసాయ యోగ్యమైన ప్రతి భూమికి రైతు భరోసా కల్పిస్తామని, ఉపాధి హామీ పథకంలో కనీసం ఇరవై రోజుల పాటు కూలి పనికి వెళ్లిన వారికే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వర్తింప చేస్తామని, ప్రతి కుటుంబంలో మహిళల బ్యాంకు ఖాతాలకే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా మొత్తాన్ని బదిలీ చేస్తామని తెలిపారు.

# రైతుల ఆత్మహత్యలు అన్నీ ప్రభుత్వ హత్యలే

-ఏడాదిలో వ్యవసాయ రంగాన్ని తిరోగమనం వైపు మల్లించారు
-మాజీ వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** రైతుల హత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనని కాంగ్రెస్ ఏడాది పాలనలో వ్యవసాయ రంగం తిరోగమిపాలైందని జోగులాంబ గద్వాల జిల్లా మానపాడు రైతు శేఖర్ రెడ్డి మరణం పట్ల సంతాపం తెలియజేసిన సందర్భంగా నిరంజన్ రెడ్డి సోమవారం అన్నారు. మొన్న ఆదిలాబాద్ లో ఒక రైతు బ్యాంకులోనే ఆత్మహత్య చేసుకున్నాడు నిన్న ఇంకో రైతు రాథోడ్ గోకుల్ ఆదిలాబాద్ లో ఆత్మహత్య చేసుకున్నాడు నేడు జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలకేంద్రంలో బొంకూరు శేఖర్ రెడ్డి అనే మిర్చి రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు పంట పెట్టుబడికి డబ్బులు లేక, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక, ప్రభుత్వ పంటల కొనుగోళ్లు లేక రైతులు అప్పుల పాలవుతున్నారని పదేళ్ల కాలంలో రూ.4.5 లక్షల కోట్లతో కేసీఆర్ వ్యవసాయ రంగానికి చేయూతఅందించారని నేరుగా రైతుల ఖాతాలకు రూ.73 వేల కోట్లు 11 విడతల్లో రైతుబంధు కింద జమ చేశారుఅయనఅని అబద్దపు హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదిలో వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందని ఆత్మవిశ్వాసంతో తలెత్తుకుని తిరుగుతున్న రైతుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసిందని ఏడాదిలో 400 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నా ప్రభుత్వంలో చలనం లేదని ఆత్మహత్య చేసుకున్న రైతుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి శేఖర్ రెడ్డి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

# చెట్టు = అమ్మ, చెత్త = రోగం

చెట్టు మన జీవితానికి అమ్మంత ప్రాముఖ్యమైనది. అది మనకు ప్రాణవాయువును అందిస్తుంది, ప్రకృతిని సంరక్షిస్తుంది, మన శ్రేయస్సుకు తోడ్పడుతుంది. చెట్టు ఉంటే జీవితం ఉందని చెప్పడం అసత్యం కాదు. మరోవైపు, చెత్త అనేది రోగాలకు కారణమవుతుంది. చెత్త ఎక్కడైతే పేరుకుపోతుందో అక్కడ పర్యావరణం కలుషితమవుతుంది, నీరు, గాలి, నేల నాశనం అవుతాయి.

**చెట్టు ఎలా అమ్మలా ఉంటుంది:**

-మనకు ఆక్సిజన్ అందిస్తుంది.
-నీడ, చల్లదనం, ఆహారం, చెక్క, ఔషధాలు అందిస్తుంది.
-ప్రకృతి మనుగడలో కీలక పాత్ర పోషిస్తుంది.

**చెత్త ఎలా రోగంగా మారుతుంది:**

-చెత్త పేరుకుపోతే దోమలు, చీమలు, బ్యాక్టీరియా పుట్టుక.
-కాలుష్యం వల్ల శ్వాసకోశ, నీరు మరియు ఆహారానికి సంబంధించిన రోగాలు.


చెట్టు మన జీవితానికి అమ్మవంటిది. అందుకే మనం చెట్లను నాటాలి, వాటిని కాపాడాలి.

చెత్త మన జీవనానికి రోగం. అందుకే చెత్తను తగ్గించాలి, పునర్వినియోగం చేయాలి, పర్యావరణాన్ని స్వచ్ఛంగా ఉంచాలి.

"ప్రకృతిని ప్రేమిద్దాం, జీవనాన్ని కాపాడుకుందాం!"
మీ నరేష్ దండు సామాజిక కార్యకర్త

# పౌరహక్కుల నేత ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్ట్ దారుణం

-ఇది ప్రజాపాలన కాదు ప్రజలను పీడించే పాలన
-మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి.నిరంజన్ రెడ్డి



**వనపర్తి, జనవరి 20(నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** అచ్చంపేట నియోజకవర్గం బల్మూరు మండలం మైలారంలో మైనింగ్ కు వ్యతిరేకంగా గ్రామస్తుల నిరసనకు మద్దతు తెలిపేందుకు వెళ్లిన ప్రొఫెసర్ హరగోపాల్, ఇతర ప్రజాసంఘాల నాయకులను అరెస్ట్ చేయడం కాంగ్రెస్ సర్కారు నియంతృత్వ పాలనకు నిదర్శనం నిరంజన్ రెడ్డి అన్నారు. ప్రొఫెసర్.హరగోపాల్ ప్రశ్నించే గొంతుక అని ప్రజల జీవనవిధానాన్నికి భంగం కలిగించే మైనింగ్ ఆపాలని పోరాడుతున్నప్రొఫెసర్.హరగోపాల్ ని అరెస్టు చేయడం ప్రశ్నించేవారిని అణగదొక్కడమే అని అన్నారు. కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చిన మేధావులు ఇప్పటికైనా భ్రమలు వీడి ప్రజాపక్షాన నిలబడాలని ఆయన సూచించారు. ప్రొఫెసర్ హరగోపాల్ అరెస్టును తీవ్రంగా ఖండించిన ఖండించిన మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి.

# నేడు కుభ్యాతాండ గ్రామంలో గ్రామసభ

**మాడుగుల, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : కుభ్యా తాండ గ్రామపంచాయతీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్ సాయి దిరాజ్ ఆధ్వర్యంలో నేడు ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా గ్రామసభ నిర్వహించబడనుంది. ఈ కార్యక్రమంలో రెవెన్యూ విభాగం నుండి ఆర్ఐ, అగ్రికల్చర్ డిపార్ట్మెంట్ నుండి ఏఈఓ పాల్గొననున్నారు. గ్రామ మాజీ సర్పంచ్లు, ఉప సర్పంచ్లు, మాజీ వార్డ్ సభ్యులు, ఎంపీటీసీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, అంగన్వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, గ్రామస్థాయిలో అధికారులు సహా ప్రజలు ఈ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నారు. ఈ సభలో రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు దరఖాస్తులు స్వీకరించబడతాయి. ఈ సభ ప్రజలకు వివిధ ప్రభుత్వ పథకాల సౌకర్యాలను చేరువ చేసే లక్ష్యంతో జరుగుతుంది. కుభ్యాతాండ గ్రామపంచాయతీ కార్యాలయం ఆధ్వర్యంలో ప్రజలు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమంలో పాల్గొనాలని ఆశిస్తున్నారు.

# లక్ష్మీపల్లి శ్రీధర్ రెడ్డినీ హత్యచేసిన నిందితులను వెంటనే పట్టుకోవాలి

-యస్.పి రావుల.గిరిధర్ కి మాజీ ఎం.ఎల్.ఏ బీరం విజ్ఞప్తి



**వనపర్తి, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్) :** గత ఏడు నెలల క్రితం లక్ష్మీపల్లికి చెందిన మండల బి.ఆర్.ఎస్ నాయకులు శ్రీధర్ రెడ్డి హత్యగావింపబడి ఏడు నెలలు గడుస్తున్న నేటికి నిందితులను పట్టుకోకపోవడం విడ్డూరం అని మాజీ ఎం.ఎల్ ఏ బీరం.హర్షవర్ధన్ రెడ్డి ఎస్.పి కి విజ్ఞప్తి చేశారు. ఇలాంటి చర్యల వల్ల కుటుంసభ్యులలో మరియు నాయకులలో ఆత్మస్థైర్యం కోల్పోయి అభద్రత భావానికి గురవుతున్నారని అన్నారు. స్పందించిన ఎస్.పి రావుల.గిరిధర్ నిందితులను పట్టుకుంటామని హామీ ఇచ్చారు బీరం హర్షవర్ధన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ చాలా సమయం ఓపికపటామని అతి త్వరలో ప్రజాక్షేత్రంలో ఉద్యమాలు చేస్తామని నిందితులను పట్టుకునేవరకు పోరాడుతామని అన్నారు. బీరం.హర్షవర్ధన్ రెడ్డి వెంట జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్, రాష్ట్ర బి.ఆర్.ఎస్ నాయకులు అభిలాష్ రావు,మాజీ ఎం.పి.పి సోమేశ్వరమ్మ,మాజీ జెడ్పీటీసీ వెంకట్రావమ్మ,మండల పార్టీ అధ్యక్షులు,సభ్యులు ఉన్నారు.

# ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళా మృతి

**నారాయణపేట, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** నారాయణపేట మండలం సింగారం చౌరస్తాలో సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సు టైర్ల కింద పడి వివాహిత మహిళ స్పాట్లోనే మృతి చెందింది. ఈ ఘటన బస్సులో ఉన్న ప్రయాణికులను కలవరపరిచింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, మహిళ రోడ్డు దాటుతుండగా ఈ ప్రమాదం సంభవించింది. మహిళకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియవలసి ఉంది.

# సమాజంలో ఆర్యవైశ్యులది కీలకపాత్ర

-షాద్ నగర్ ఎమ్మెల్యే "వీర్లపల్లి శంకర్"
-ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా ప్రమాణ స్వీకారం



**షాద్ నగర్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)** సమాజంలో ఆర్యవైశ్యులది కీలక పాత్ర అని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం రాత్రి శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో జరిగిన పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకారం చేసిన మలిపెద్ది శ్రీనివాస్ గుప్తను ఎమ్మెల్యే అభినందిస్తూ సన్మానించారు. సమాజంలో సేవల పరంగా ఆర్థికంగా సహకరిస్తూ తమ సంపాదనలో ఎంతో కొంత సామాజిక సేవలకు వినియోగిస్తున్న వారిలో ఆర్యవైశ్యులు అగ్రస్థాయిలో ఉంటారని అన్నారు. మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా అంచలంచలుగా ఎదుగుతూ ఆర్యవైశ్య సంఘం ద్వారా నిరుపేద ఆర్యవైశ్యులను ఆదుకునే క్రమంలో ముందుంటారని కొనియాడారు. గతంలో కూడా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఇంకా ఇతర విభాగాల్లో ఆయన అందించిన సేవలు ఎంతో గొప్పవని అన్నారు. మలిపెద్ది శ్రీనివాస్ గుప్తా ఆర్యవైశు ్యల అభివృద్ధి కోసం కృషి చేయాలని తన వంతు సహకారం కూడా ప్రభుత్వం ద్వారా ఉంటుందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆర్యవైశ్య సంఘం నాయకులు మహిళలు పెద్ద ఎత్తున ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఆయనను అభిమానంతో సన్మానించారు..

# ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కలెక్టర్ ఆదేశాలు



**రంగారెడ్డి, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 87 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డికి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ శాఖ నుంచి 38, ప్రజాపాలన దరఖాస్తులు 10, పిడి హౌసింగ్ 9, మొత్తం 87 దరఖస్తులు అందాయి. అనంతరం జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ, ఈ నెల 21 నుండి నిర్వహించే గ్రామసభల గురించి మున్సిపాలిటీల వార్డుల్లో, గ్రామ పంచాయతీలలో ముందుగా ప్రజలకు తెలిసే విధంగా టామ్ టామ్ వేయాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఎదురైతే సమాచారం అందించడానికి సంబంధిత శాఖల పరిధిలో కంట్రోల్ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని అన్నారు. గణతంత్ర దినోత్సవం వేడుకల్లో వివిధ శాఖలకు సంబంధించిన స్టాల్స్, శకటాలు ఏర్పాటు చేయాలని, విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పల్లె గాయని నుంచి పాన్-ఇండియా వైపు సంగీత నక్షత్రంగా శైలజా భట్టు అద్భుత ప్రయాణం



- స్వరాలతో జీవితాన్ని కళగా మలిచిన గాయని
- తెలంగాణ మట్టిలో పుట్టిన సంగీత ఆభరణం
- సంగీత ప్రపంచాన్ని శాసించే ఓ మధుర గాత్రం
- భాషల సరిహద్దులు దాటిన స్వరం





హైదరాబాద్,జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్):

తెలంగాణా మట్టిలో పుట్టిన ఎన్నో ప్రతిభలలో, సంగీత ప్రపంచాన్ని తన ప్రత్యేకతతో ఆకట్టుకుంటున్న గాయని శైలజా భట్టు ఒక వెలుగునక్షత్రం. పాటలు పాడటం మాత్రమే కాకుండా, వాటిలో హావభావాలను జత చేస్తూ ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుంటున్న ఈ గాయని పేరు ఇప్పుడు తెలుగు రాష్ట్రాల్లో గాని, దేశవ్యాప్తంగా గాని వెలుగులోకి వస్తోంది.

**కుటుంబ నేపథ్యం**
వరంగల్ జిల్లా నుంచి వచ్చిన శైలజా భట్టు శ్రీ లక్ష్మీ, సురేందర్ దంపతుల గారాలపట్టి. సంగీతం పట్ల ఆమె చిన్నప్పటి నుంచే ప్రగాఢ ఆసక్తి చూపుతూ, ఆ గాత్రం దశలవారీగా మేల్కొన్నది. ఆమె కుటుంబం నుంచి వచ్చిన ప్రోత్సాహం, సపోర్ట్ ఆమెకు ఆరంభ దశలో బలంగా నిలిచింది.

**విద్యాభ్యాసం & సంగీత పట్ల అభిరుచి** చదువులోనూ ప్రతిభావంతురాలైన శైలజా భట్టు పొలిటికల్ సైన్స్‌లో పీజీ పూర్తి చేశారు. కానీ ఆమె గుండెల్లో సంగీతమే. ఆ కలను గౌరవిస్తూ వి. తిరుపతయ్య దగ్గర శ్రద్ధగా శిక్షణ తీసుకున్నారు. ఇది ఆమె ప్రతిభను మెరుగుపరచడంలో కీలకపాత్ర పోషించింది.

**బోల్ బేబీ బోల్‌తో గుర్తింపు** :శైలజా భట్టు తెలుగు టెలివిజన్ షో "బోల్ బేబీ బోల్" (సీజన్ 5, 6) ద్వారా వెలుగులోకి వచ్చారు. తన స్వరమాధుర్యంతో ప్రేక్షకులను ముగ్ధులను చేసిన ఆమె, ఈ కార్యక్రమంతో పల్లె గాయని నుంచి జనమంతా అభిమానించే గాయని అయ్యారు.

**భాషల మల్టీటాలెంట్** తెలుగు పాటలతోపాటు హిందీ, బంజారా, కన్నడ భాషల్లోనూ పాటలు పాడగల ఈ గాయని సంగీత ప్రస్థానం ఆమె టాలెంట్‌ను మరింత విస్తరించగలుగుతోంది. వివిధ భాషల్లో ఆమె పాడిన పాటలు ఆమెకు ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చాయి.

**సినీ ప్రపంచంలో అడుగులు** ఇప్పటివరకు రెండు సినిమాల్లో పాటలు పాడిన శైలజా, 80కి పైగా పాటలు యూట్యూబ్‌లో విడుదల చేసి అభిమానుల మనసులు గెలుచుకున్నారు. ఈ అమ్మడి ప్రతిభ సంగీత ప్రపంచానికి ఓ అమూల్యమైన ఆభరణం.

**మాటల వెనుక స్వరానికి జీవం** శైలజా గాత్రం మాత్రమే కాదు. పాట పాడేటప్పుడు ఆమె చూపే హావభావాలు, అభినయం ప్రతీ పదానికి కొత్త ప్రాణం పోస్తాయి. ప్రేక్షకులు కనీసం ఆమెను ఒకసారి విన్నా, మరలా విన్నాలనుకుంటారు.

**భవిష్యత్తు పట్ల ఆశలు** పల్లె గాయని నుంచి పాన్-ఇండియా స్థాయికి ఎదగాలన్న శైలజా కల నిజమవ్వడం ఈ సంగీతప్రపంచానికి వరంగా ఉంటుంది. సరైన మార్గదర్శకత్వం, అవకాశాలు ఆమెను అంతర్జాతీయ స్థాయిలో నిలబెడతాయనే నమ్మకం ఉంది.

**శైలజా భవిష్యత్తు వెలుగు** ఇలాంటి అసామాన్య ప్రతిభావంతుల్ని తెలుగు పరిశ్రమ వెండితెరకు పరిచయం చేస్తే, సంగీత ప్రపంచంలో మరింత అద్భుతాలు జరుగుతాయి. ఆమెకు మరింత మంది అభిమానులూ, ప్రోత్సాహకులూ లభించాలని, ఆమె ప్రతిభ ప్రపంచం మొత్తం గుర్తించాలని మనం కోరుకుందాం.
తెలంగాణా గడ్డపై పుట్టి సంగీత ప్రపంచంలో తన స్థానాన్ని సృష్టించిన శైలజా భట్టు పేరు భవిష్యత్తులో భారత సంగీత చరిత్రలో ఓ గుర్తింపు తెచ్చుకోవడం ఖాయం.
ఆమె గాత్రం ఇంకా ఎన్నో మధురస్వరాలతో ప్రపంచాన్ని మంత్రముగ్ధం చేస్తుందని ఆశిద్దాం!



# అర్హులైన ప్రతి కుటుంబం కి రేషన్ కార్డ్ అందిస్తాం

– తహశీల్దార్ కార్తీక్ కుమార్



**వెల్దండ, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డు అందజేస్తామని, ప్రభుత్వ నిబంధన ప్రకారం అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు అందజేస్తామని వెల్దండ మండల తహసీల్దార్ కార్తీక్ కుమార్ తెలిపారు. రేషన్ కార్డు కోసం ఏ విధంగా దరఖాస్తు చేసిన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు తప్పనిసరిగా వస్తుందన్నారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల లిస్టు ఫైనల్ లిస్టు కాదని, అర్హులను గుర్తించి దరఖాస్తు చేసుకున్న ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామన్నారు. అర్హులై ఉండి రేషన్ కార్డు రాకుంటే, గ్రామ సభ ద్వారా మరోసారి రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని చెప్పారు. సమగ్ర కుటుంబ సర్వే ఆధారంగా ప్రతి కుటుంబానికి రేషన్ కార్డు మంజూరు చేస్తామని తాసిల్దార్ కార్తీక్ కుమార్ పేర్కొన్నారు. లబ్ధిదారులు ఆందోళన చెందకుండా ఆయా గ్రామాల్లో నిర్వహించే గ్రామ సభల్లో, అధికారులు చదివే రేషన్ కార్డు లిస్టును పరిశీలించి, లిస్టులో పేర్లు నమోదు కాని వారు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# వెల్జాల్ గ్రామంలో బ్రహ్మోత్సవాలకు రావాలని రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కేవీఎన్ రెడ్డికి ఆహ్వానం



**తలకొండపల్లి, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
తలకొండపల్లి మండలం వెల్జాల్ గ్రామంలో లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు వచ్చేనెల ఫిబ్రవరి 7 నుండి 9 వరకు జరగనున్నాయి. ఈ బ్రహ్మోత్సవాలకు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డిని హైదరాబాద్ లోని బి ఆర్ కే భవన్ లో కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు గుండా యాదగిరి నరసింహ శర్మ, గుండా శ్రీనివాసమూర్తి, మాజీ ఎంపీటీసీ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ సభల్లో పాల్గొననున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**కల్వకుర్తి, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డుల లబ్ధిదారుల ఎంపిక కోసం రేపటి నుంచి గ్రామసభలు జరుగనున్నాయి. తలకొండపల్లి మండలంలో రేపు ఉదయం 9 గంటలకు, కల్వకుర్తి పట్టణంలో 1వ వార్డు, 5వ వార్డు గ్రామసభల్లో మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొంటారు.

# గొర్ల కాపారుల సమస్యలను పరిష్కారించాలి

– మాడెం ఈదయ్య యాదవ్



**హైదరాబాద్, జనవరి 20(నీలగిరి ఎక్స్ ప్రెస్)**
తెలంగాణా రాష్ట్ర షిప్ అండ్ గోట్స్ డెవలప్మెంట్ బోర్డ్ చైర్మన్ మరియు బీఆర్ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి డా. దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ ను సోమవారం హైదరాబాదులోని ఆయన నివాసంలో నల్గొండ జిల్లా దేవరకొండ మండల బీఆర్ఎస్ యువ నాయకులు మాడెం ఈదయ్య యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, పాడి రైతులు మరియు గొర్రె కాపర్ల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో సబ్సిడీ కింద యాదవులకు గొర్రెల పంపిణీ సత్ఫలితాన్నిచ్చిందని తెలిపారు. దూదిమెట్ల బాలరాజ్ మాట్లాడుతూ, పాడి రైతుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దేశానికి వెన్నెముకగా నిలవాల్సిన రైతన్నను గాలికొదిలేసారని ఆరోపించారు.

# అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై కాల్పులు

చైతన్యపురికి చెందిన యువకుడు మృతి

**హైదరాబాద్,**
అమెరికాలో హైదరాబాద్ యువకుడిపై దుండగులు కాల్పులకు పాల్పడ్డారు. ఈ ఘటనలో చైతన్యపురికి చెందిన రవితేజ మృతి చెందాడు. అతని మరణ వార్త విని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మాస్టర్స్ చదివేందుకు 2022లో రవితేజ అమెరికా వెళ్లినట్లు సమాచారం. దీనిపై ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.


# ప్రియుడిని చంపిన ప్రియురాలికి ఉరిశిక్ష



**రువనంతపురం,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేరళ రాజధాని తిరువనంతపురం కోర్టు మరో కీలక తీర్పు వెల్లడించింది. ప్రియుడిని చంపిన కేసులో ప్రియురాలికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. 2022లో కేరళలో విషం కలిపిన కూల్‌డ్రింక్ ఇచ్చి ప్రియుడు శరోన్ రాజ్‌ను ప్రియురాలు గ్రీష్మ చంపిన ఘటన సంచలన సృష్టించింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. పూర్తి ఆధారాలు సేకరించి కోర్టుకు సమర్పించారు. ఆధారాలను పరిశీలించిన తిరవనంతపురం కోర్టు.. గ్రీష్మకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు వెలువరించింది. అంతేకాదు.. శరోన్ రాజ్ ను చంపేందుకు గ్రీష్మకు సహకరించిన బంధువుకు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. కేరళలో బాయ్‌ఫ్రెండ్‌ను 2022లో చంపిన గ్రీష్మ అనే యువతికి స్థానిక నెయ్యట్టింకర అదనపు జిల్లా సెషన్స్ కోర్టు మరణ శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. ఈ కేసులో మూడవ నిందితుడు, ఆమెకు సహకరించిన ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్‌కు కోర్టు మూడు సంవత్సరాల కారాగార శిక్ష విధించింది. విద్యాపరమైన తన విజయాలు, గత నేర చరిత్ర లేకపోవడం, తన తల్లిదండ్రులకు ఏకైక కుమార్తెను కావడం వంటి కారణాలను పేర్కొని తనకు శిక్ష విధించడంలో కనికరం చూపాలని 24 ఏళ్ల దోషి కోర్టును అభ్యర్థించింది. అయితే, ఆమె క్రూర నేరానికి పాల్పడి, సాక్షాలను చెరిపివేసి, దర్యాప్తును తప్పుదోవ పట్టించిందని, ఆమె వయస్సును పరిగణనలోకి తీసుకోలేమని కోర్టు తన 586 పేజీల తీర్పులో స్పష్టం చేసినట్లు ప్రాసిక్యూటర్ వెల్లడించారు. తనతో రిలేషన్‌షిప్ ముగించేందుకు శరణ్ రాజ్ (23) ఒప్పుకోలేదని పెస్టిసైడ్ కలిపిన డ్రింక్ తాగించి అతనిని గ్రీష్మ చంపేసింది. ఆ ఘాతుకం జరిగిన సమయానికి ఆమె వయస్సు 22 సంవత్సరాలు. ఇక ప్రాసిక్యూషన్ నేరాన్ని రుజువు చేయడానికి సందర్భోచిత, డిజిటల్, శాస్త్రీయ అంశాలపై ఆధారపడిందని కోర్టు పేర్కొన్నది. దోషి దశలవారీగా ఈ నేరం సాగించడానికి కుట్ర పన్నిందని, ఆమెకు నేర నేపథ్యం ఉందని, గతంలో ఆ యువకుని హత్యకు ప్రయత్నించిన ఆమె దర్యాప్తును తప్పుదోవ పట్టించేందుకు అరెస్టు తరువాత తన ప్రాణం తీసుకునేందుకు ప్రయత్నించిందని కూడా కోర్టు పేర్కొన్నది. కాగా, ఇది అత్యంత అరుదైన కేసు అని, నిందితులకు ఉరిశిక్ష విధించాలని వాదించినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ విఎస్ వినీత్ కుమార్ మీడియాతో చెప్పారు. ఇది ఆదర్శప్రాయమైన ఒక తీర్పుగా ఆయన పేర్కొన్నారు. 2022లో గ్రీష్మ తన ప్రియుడు శరణ్ రాజ్‌కు పారాక్వాట్ అనే పెస్టిసైడ్ కలిపిన ఆయుర్వేద టానిక్‌తో విషం ఇచ్చింది. దానితో అతని శరీరంలోని పలు అవయవాలు విఫలం కావడంతో 11 రోజుల తరువాత అతను చనిపోయాడు. తమిళనాడుకు చెందిన ఆర్మీలో పని చేసే ఒక వ్యక్తితో తన పెళ్లి ఖాయం కావడంతో రాజ్‌తో తన అనుబంధాన్ని ముగించాలని ఆమె అనుకుంది. కానీ తమ సంబంధం ముగింపునకు అతను నిరాకరించడంతో హత్యకు గ్రీష్మ పథకం వేసింది. హతుడు శరణ్ రాజ్ తిరువనంతపురం జిల్లా పరశ్శల వాసి. హత్యతో సహా భారతీయ న్యాయ సంహితలోని వివిధ సెక్షన్ల కింద గ్రీష్మ దోషిగా తేలింది. ఆమె మేనమామ నిర్మలకుమారన్ నాయర్ సాక్షాలను ధ్వంసం చేసిన కేసులో దోషిగా తేలాడు. అయితే, కస్టడీలోకి తీసుకున్న అతని తల్లి సాక్షాధారాలు లేకపోవడంతో నిర్దోషిగా విడుదల అయింది. కేసు దర్యాప్తును పర్యవేక్షించిన అప్పటి ఎస్పి డి శిల్ప కోర్టు తీర్పును స్వాగతిస్తూ, పోలీస్ దర్యాప్తు బృందం సమష్టి కృషికి ఇది విజయం అని అన్నారు.

# పోతూపోతూ బైడెన్ కీలక నిర్ణయం

## ఆంటోనీ ఫాచీ, మార్క్ మిల్లెలకు క్షమాభిక్ష




**వాషింగ్టన్,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అమెరికా అధ్యక్ష పదవీకాలం మరికొన్ని గంటల్లో ముగియనున్న వేళ జో బైడెన్ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. గతంలో ట్రంప్‌ను విమర్శించిన అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ ఆంటోనీ ఫాచీ, రిటైర్డ్ జనరల్ మార్క్ మిల్లె తదితరులకు ముందస్తు క్షమాభిక్ష ఆదేశాలు జారీ చేశారు. వీరితోపాటు క్యాపిటల్ హిల్ దాడులపై విచారణ జరిపిన హౌస్ కమిటీ సభ్యులకూ ఉపశమనం కలిగించారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రతీకార చర్యలు తీసుకునేందుకు వీలు లేకుండా ఈ మేరకు చర్యలు తీసుకున్నట్లు జో బైడెన్ వెల్లడించారు. అమెరికా నూతన అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేయనున్న క్రమంలో ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# యాదాద్రీశుడి ఆదాయం రూ.4,17,13,596



**యాదగిరిగుట్ట,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.4,17,13,596 లు చేకూరింది.గత 47 రోజులుగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు హుండీలలో సమర్పించిన నగదు, నగల కానుకల లెక్కింపు పర్వం దేవస్థానం చేపట్టింది. కొండకింద ఆధ్యాత్మిక వాడలోని శ్రీసత్య నారాయణస్వామి వ్రత మండపంలో సోమవారం చేపట్టిన లెక్కింపులో ఆలయ ఉద్యోగులు,కల్యాణకట్ట సిబ్బంది,అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు,భక్తులు,మహిళా సేవ సమాఖ్య బృందాలు పాల్గొన్నాయి. కొనసాగిన లెక్కింపులో నగదు రూ.4,17,13,596, మిశ్రమ బంగారం 229 గ్రాములు, వెండి7,050 గ్రాములు చేకూరినట్లు ఈవో భాస్కరరావు తెలిపారు. ఎస్పీఎఫ్ జవాన్లు,సీసీ కెమెరాల నిఘా మధ్య ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు పర్వం కొనసాగింది.

# సైఫ్ కేసులో కోర్టులో ఇద్దరు లాయర్ల మధ్య గొడవ



**ముంబై,(నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం ముంబై మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ ముందు నిందితుడిని హాజరుపరిచారు. ఈ సందర్భంగా కోర్టులో నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిందితుడు షెహజాద్ మహమ్మద్ తరఫున వాదించేందుకు ఇద్దరు లాయర్లు గొడవపడ్డారు. దీంతో న్యాయమూర్తి వారిద్దరి మధ్య సయోధ్య కుదిర్చారు. ఇంతకూ ఏం చేశారంటే.. సైఫ్ అలీఖాన్‌పై కత్తితో దాడిచేసిన కేసులో నిందితుడు షరీఫుల్ ఇస్లాం షెహజాద్ మహమ్మద్ రోహిల్లా అమీన్ ఫకీర్ (30)ను ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేశారు. బంగ్లాదేశ్‌కు చెందిన అతడిని థాణేలో అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్ వద్ద అదుపులోకి తీసుకున్నారు. అక్కడి నుంచి ముంబైకి తరలించారు. అనంతరం భారీ బందోబస్తు నడుమ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరపరిచారు. నిందితుల బోనులో నిలబడి ఉన్న షెహజాద్‌ను.. పోలీసులపై ఏమైనా ఫిర్యాదులు ఉన్నాయా అంటూ న్యాయమూర్తి ప్రశ్నించారు. దానికి అతడు వ్యతిరేకంగా సమాధానం ఇచ్చాడు. ఈ క్రమంలో షెహజాద్ వద్దకు వెళ్లిన ఓ లాయరు.. అతని తరఫున తాను వాదిస్తానంటూ వకాలత్ పత్రంపై సంతకం చేస్తున్నాడు. అంతలోనే మరో న్యాయవాది కూడా నిందితుని వద్దకు వెళ్లి తాను వకాల్తా పుచ్చుకుంటానంటూ సంబంధిత పత్రాలపై సంతకం కోసం ప్రయత్నించాడు. దీంతో ఇద్దరు లాయర్లు కోర్టు హాలులోనే వాదులాడుకున్నారు. దీంతో జోక్యం చేసుకున్న న్యాయమూర్తి.. ఇద్దరూ ఒక టీమ్‌గా అతని తరఫున వాదనలు వినిపించవచ్చని తెలిపారు. దానికి ఆ ఇద్దరు లాయర్లు కూడా సమ్మతించారు. కాగా, నిందితుడికి న్యాయస్థానంలో హాజరుపర్చగా ఐదు రోజుల పోలీస్ కస్టడీకి పంపిందని, ఈ దాడి వెనుక అంతర్జాతీయంగా ఏదన్నా కుట్ర ఉందా అన్న కోణంలో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు. బంగ్లాదేశ్ నుంచి ఐదు నెలల క్రితం భారత్‌కు అక్రమంగా వచ్చిన నిందితుడు తన పేరును విజయ్ దాస్‌గా మార్చుకున్నాడు. తర్వాత హౌస్ కీపింగ్ సహా చిన్నచిన్న పనులు చేసేవాడు. ఆ ఇల్లు నటుడు సైఫ్ అలీఖాన్‌దని తనకు తెలియదని, కేవలం చోరీ కోసమే అందులో ప్రవేశించినట్టు నిందితుడు తెలియజేసినట్టు పోలీస్ వర్గాలు వెల్లడించాయి.

# నక్కర్త మేడిపల్లి ప్రభుత్వ పాఠశాల పునర్నిర్మాణానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సాయం అందజేత



**యాచారం, జనవరి 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్)**
యాచారం మండల పరిధిలోని నక్కర్త – మేడిపల్లి పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు 1990-1991 ఎస్ఎస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కోసం 26 వేల రూపాయలు ఎచ్.ఎం ఉదయశ్రీ కి అందజేశారు. ఈకార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎండీ ఖాజ, తల్లారి మల్లేష్, పల్లోజు శ్రీనివాస్ చారి, కంబలపల్లి యాదయ్య, తహీర బేగం, ఈసందర్భంగా వారు మాట్లాడుతూ... పాఠశాల లోని కొని గదులు మరియు పురాతనమైన ఆఫీస్ రూమ్ మరమ్మతులు, కలర్స్ విద్యార్థులకు క్రీడా సామాగ్రి పాఠశాల అభివృద్ధి కోసం పూర్వ విద్యార్థులు అందరూ ముందుకు రావాలని చేయి చేయి కలుపుదాం మన పాఠశాలను బాగు చేసుకుందాం అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బన్నె శ్రీశైలం, దేంది మధుకర్ రెడ్డి, మెటే శ్రీను, మరియు ఉపాధ్యాయులు, ప్రొద్దుటూరి రవీందర్ గుప్త తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా శ్రీ ఉమా మహేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు



**అచ్చంపేట, జనవరి 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అచ్చంపేట పట్టణ పరిధిలో శ్రీ ఉమా మహేశ్వర దేవస్థానం బ్రహ్మోత్సవాలు ఆరవ రోజున స్వామివారికి అభిషేకాలు, సాయంత్రం పల్లకి సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఆరవ రోజు బ్రహ్మోత్సవాల్లో దేవస్థాన ప్రధాన పూజారి వీరయ్య శాస్త్రి, వేద పండితులు, అర్చకులు, భజన మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది పాలు పంచుకున్నారు. కమిటీ చైర్మన్ వీర మాధవ్ రెడ్డి ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేసి, భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం పొందారు. ఈ కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు పవన్, సైదులు, ఇతర అర్చకులు, భజన మండలి సభ్యులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఉద్యాన పంటలపై అధికారులు దృష్టి పెట్టాలి

## – రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి



**హైదరాబాద్, జనవరి 20 (నీలగిరి ఎక్స్ప్రెస్)**
హైదరాబాద్ పట్టణంలోని బి ఆర్ కె భవన్ లో ఈరోజు రైతు కమిషన్ కార్యాలయంలో ఉద్యానవన పంటలపై సమావేశం జరిగింది. ఈ సమావేశంలో రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి, కమిషన్ సభ్యులు కెవిన్ రెడ్డి, రామ్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భవాని రెడ్డి, హార్టికల్చర్ డైరెక్టర్ షేక్ యాస్మిన్ భాష, ఉద్యానవన శాఖ అధికారి బాబు, ఏడిఏ సంధ్యారాణి, వ్యవసాయ అధికారి హరి వెంకట ప్రసాద్, సుస్థిర వ్యవసాయ ప్రతినిధి భాస్కర్ పాల్గొన్నారు. సమావేశంలో అధికారులు కూరగాయల పంట సాగుపై దృష్టి సారించాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే, పెస్టిసైడ్ వాడకం తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కోదండ రెడ్డి మాట్లాడుతూ తక్కువ కాలంలో ఎక్కువ దిగుబడి ఇచ్చే పంటలు సాగు కారణంగా రైతులు మరియు వినియోగదారులు అనారోగ్యానికి గురి అవుతున్నారని, చేంజ్ యువర్ సాకులు ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. వంకాయ, బెండకాయ సాగులో విపరీతంగా పెస్టీసైడ్ వాడుతున్నట్లు అధికారులు తెలిపారు. క్లస్టర్ సాగులను ప్రోత్సహించాలన్నారు. సబ్సిడీలను క్లస్టర్ విధానంలో సాగు చేసే రైతులకు మరింత చేరేలా చూడాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యానవన పంటలు సాగు చేసే రైతులతో సమావేశాలు, అవేర్నెస్ ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. త్వరలో హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాలో కూరగాయలు సాగు చేస్తున్న తోటలను సందర్శించి, రైతులతో ముఖాముఖి కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. పురుగుల మందుల వాడకాన్ని తగ్గించేందుకు మండల వ్యవసాయ అధికారులు దృష్టి సారించాలని సూచించారు.




## భారీ అంచనాలు పెంచుతున్న తండేల్

టాలీవుడ్ యాక్టర్ అక్కినేని నాగచైతన్య -సాయిపల్లవి కాంబోలో సినిమా వస్తుందంటే క్రేజ్ ఎలా ఉంటుందో తెలిసిందే. ఇప్పటికే లవ్ స్టోరీతో బాక్సాఫీస్‌ను షేక్ చేసిన ఈ స్టార్ యాక్టర్లు ప్రస్తుతం తండేల్‌లో నటిస్తున్నారు. రొమాంటిక్ డ్రామా నేపథ్యంలో వస్తోన్న ఈ చిత్రం చందూ మొండేటి డైరెక్షన్‌లో తెరకెక్కుతోంది. ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 7న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ఇప్పటికే ప్రకటించారు. ఈ మూవీ తెలుగు, తమిళం, హిందీ భాషల్లో విడుదల కానుంది. అయితే తాజాగా మరో క్రేజీ నిర్ణయాన్ని తీసుకున్నారన్న వార్త ఒకటి నెట్టింట హల్ చల్ చేస్తోంది. తండేల్ మలయాళం వెర్షన్‌ను రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తుండగా.. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన కూడా ఉండబోతుందట. సాయిపల్లవికి మలయాళంలో సూపర్ క్రేజ్ ఉంటుందని తెలిసిందే. ఒకవేళ ఇదే నిజమైతే తండేల్ సినిమాకు మాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద వసూళ్లు పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. తండేల్ నుంచి ఇప్పటికే లాంచ్ చేసిన బుజ్జి తల్లి సాంగ్‌కు మంచి స్పందన వస్తోంది. 2018లో గుజరాత్ జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా వస్తోన్న తండేల్ చిత్రాన్ని గీతాఆర్ట్స్‌పై అల్లు అరవింద్ సమర్పణలో బన్నీవాసు నిర్మిస్తున్నారు. ఈ మూవీకి అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడు. తండేల్ నాగచైతన్య-చందూ మొండేటి కాంబోలో రాబోతున్న మూడో సినిమా కావడంతో ఈ ప్రాజెక్టుపై అంచనాలు భారీగానే ఉన్నాయి.

## శివుడి పాత్రలో అక్షయ్‌కుమార్

### -ఆకట్టుకుంటున్న కన్నప్ప లుక్

ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప. దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు పలువురు అగ్ర కథానాయకుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా ఈ సినిమా నుంచి బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ ఫస్ట్ లుక్‌ని విడుదల చేసింది. ఈ సినిమాలో అక్షయ్ కుమార్ పరమేశ్వరుడి పాత్రలో కనిపించబోతున్నట్లు ప్రకటించింది. ముల్లోకాలు ఏలే పరమేశ్వరుడు భక్తికి మాత్రం దాసుడు అంటూ అక్షయ్ శివుడి రూపంలో ఉన్న అక్షయ్ ఫస్ట్ లుక్‌ని పంచుకుంది.







## నా భార్యకు నా పాస్‌వర్డ్‌లు అన్నీ తెలుసు

టాలీవుడ్‌లో సక్సెస్ రేట్ ఎక్కువగా ఉన్న సీనియర్ హీరోల్లో టాప్‌లో ఉంటాడు వెంకటేశ్. తనదైన మ్యానరిజంతో వినోదాన్ని పంచే వెంకీ ఇటీవలే సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో తెరకెక్కిన ఈ మూవీలో ఐశ్వర్యా రాజేశ్, మీనాక్షి చౌదరి ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటించాడు. భార్య, మాజీ ప్రియురాలి మధ్య చిక్కుకున్న భర్త పాత్రలో నటించాడు వెంకటేశ్. ఇందులో వెంకీ చెప్పే డైలాగ్స్ చాలా మంది ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెంకటేశ్‌ను ఆసక్తికర ప్రశ్న అడిగింది యాంకర్ సుమ. మీ భార్యకు మీ మొబైల్ పాస్‌వర్డ్‌లు, ఇతర పాస్‌వర్డ్‌లు తెలుసా..? అని వెంకీని అడిగింది సుమ. దీనికి వెంకీ ఏ మాత్రం తడబడకుండా నా భార్యకు నా మొబైల్‌తోపాటు అన్ని ఖాతాలో పాస్‌వర్డ్‌లు తెలుసు. ఈ విషయంలో నేను చాలా పారదర్శకంగా ఉంటా. ఆమెకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చేశానంటూ చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. సంక్రాంతి కానుకగా జనవరి 14న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం సంక్రాంతి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. కేవలం 6 రోజుల్లోనే రూ.100 కోట్ల షేర్‌ను రాబట్టి వెంకీ కెరీర్‌లో నయా బెంచ్ మార్క్ క్రియేట్ చేసింది. అనిల్ రావిపూడి కెరీర్ మైల్ స్టోన్ సినిమాగా నిలవడమే కాకుండా.. కెరీర్‌లో సెకండ్ హయ్యెస్ట్ గ్రాసింగ్ ఫిల్మ్‌గా నిలిచింది. ఈ చిత్రంలో నరేశ్, పాపులర్ మరాఠీ యాక్టర్, యానిమల్ ఫేం ఉపేంద్ర లిమాయే, కోలీవుడ్ నటుడు వీటీవీ గణేశ్ కీలక పాత్రలు పోషించారు. ఈ మూవీని దిల్ రాజు సమర్పణలో శిరీష్ నిర్మించారు.



## మీనాక్షికి ఫస్ట్ క్రష్ అతడే

సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో హిట్టు అందుకొని వరుస హిట్లతో ఇండస్ట్రీలో దూసుకుపోతున్న స్టార్ హీరోయిన్ మీనాక్షి చౌదరి. అయితే తను ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచినప్పటి నుండి ఎవరో ఒక హీరోతో డేటింగ్ లో ఉందని, ఇంకో హీరోతో పెళ్లి అని ఎదో ఒక పుకార్లు వినిపిస్తూనే ఉన్నాయి. ఇంతకీ మీనాక్షి లైఫ్ లో లవ్ ఉందా? ఆమెకు ఎవరంటే ఇష్టం? వీటిపై ఆమె ఏమన్నారు అంటే.. తనపై వస్తున్న రూమర్స్ ని ఖండిస్తూనే మీనాక్షి తన లవ్ లైఫ్ గురించి చెప్పేసింది. తాజాగా జరిగిన ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ.. " ప్రస్తుతం అయితే నా ఫోకస్ అంత సినిమాలపైనే ఉంది. స్కూల్ లేదా కాలేజీలో స్టూడెంట్స్ కు కచ్చితంగా టీచర్లపై క్రష్ ఉంటుంది. నాక్కూడా అలాంటిదే ఉంది. నేను 9వ తరగతి చదువుతున్నప్పుడు నా క్లాస్ లో ఓ టీచర్ అంటే చాలా ఇష్టం. టోటల్ క్లాస్ మొత్తం అతడ్ని ఇష్టపడేది. నాకైతే ఇంకా ఎక్కువ ఇష్టం. అదే నా ఫస్ట్ క్రష్ అండ్ లవ్." అంటూ తన ఫస్ట్ క్రష్ ని రివీల్ చేసింది. మాటలు కొనసాగిస్తూ.. " నాకు ఆ తర్వాత మళ్లీ ప్రేమలో పడేంత టైమ్ దొరకలేదు. మరీ ముఖ్యంగా మెడిసిన్ చదువు వల్ల ప్రేమకు పూర్తిగా దూరమయ్యాను. కాలేజీ లైఫ్ లో ఎలాంటి లవ్ లేదు. చదువుతోనే సరిపోయింది. పైగా మెడికల్ కాలేజీ కదా ఒత్తిడి చాలా ఎక్కువగా ఉండేది. ఎప్పుడూ చదువే. ఇండస్ట్రీకి వచ్చిన తర్వాత కూడా నేను ఎవరి ప్రేమలో పడలేదు. కెరీర్ పై మాత్రమే ఫోకస్ పెడుతూ వస్తున్నాను. ఇప్పుడిప్పుడే సెటిల్ అవుతున్నకాబట్టి ప్రేమ, పెళ్ళికి టైమ్ ఉంది. ప్రస్తుతానికి సినిమాలే నా లోకం" అంటూ ఫుల్ క్లారిటీ ఇచ్చేసింది.